ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

శుక్రవారం 11 జూలై 2025

పనితీరు మెరుగు పడాలి

గజపతినగరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగు పడాలని, లేకుంటే చర్యలు తప్పవని జడ్పీ సీఈవో వీవీ సత్య నారాయణ హెచ్చరించారు. గజపతినగరం పంచాయతీలో పారిశుధ్య పనుల తీరుపై ఆయన గురువారం తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 10 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేశామని చెప్పారు. అందులో 75 శాతం పనులు పూర్తి చేసినట్టు ఐవీఆర్ సర్వే చెబుతోందన్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడితే చర్యలు తప్పవన్నారు.



జామి కేజీబీవీలో అధికారులతో కలిసి టగ్‌ఆఫ్‌వార్ ఆడుతున్న కలెక్టర్ అంబేద్కర్

సందడే సందడి

- ఉత్సాహంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు
- గతానికి భిన్నంగా కార్యక్రమాలు
- తల్లి పేరుతో మొక్కల పంపిణీ, సంరక్షణ బాధ్యతలు
- ప్రతి విద్యార్థికి గ్రీన్ పాస్‌పోర్టులు

విజయనగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల వద్ద గురువారం పండుగ వాతావరణం కన్పించింది. అటు ప్రైవేటు పాఠశాలల వద్ద కూడా అదే జోష్ ప్రస్ఫుటమైంది. అన్ని పాఠశాలల్లో మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా గురువారం 2,232 విద్యాలయాలు, 180 జూనియర్ కాలేజీల్లో ఈ సమావేశాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. దత్తిరాజేరు మండలం మరడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. విద్య మన భవిష్యత్తును తీర్చి దిద్దుతుందని, చదువుకోవడం ద్వారా ఉన్నత స్థానాన్ని సాధించవచ్చని ఆయన సూచించారు. కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ జామి మండలం కుమరాం కేజీబీవీ పాఠశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా నియోజకవర్గాల్లో హాజరయ్యారు. ప్రభుత్వం విద్యాశాఖ బలోపేతానికి తీసుకుంటున్న (మిగతా 8వ పేజీలో..)

మెరిట్ స్టూడెంట్‌ను కాదు.. కష్టపడి కలెక్టర్ అయ్యాను

- పేరెంట్స్ మీటింగ్‌లో కలెక్టర్ అంబేద్కర్

జామి, జూలై 10(ఆంధ్రజ్యోతి): తాను మెరిట్ స్టూడెంట్‌ను కాదని, ఒక సెకెండ్ క్లాస్ స్టూడెంట్‌ను అని, యూనివర్సిటీకి వెళ్లాక కష్టపడి చదివి గ్రూపు-2 సాధించి కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని కలెక్టర్ అంబేద్కర్ చెప్పారు. కుమారాం కేజీబీవీలో గురువారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరై కాసేపు విద్యార్థులతో మమేకమ య్యారు. పిల్లల తల్లిదండ్రులతో ఒక స్నేహితునిగా ముచ్చటించారు. చివరిగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశలో తాను ఎలా చదివిందీ వివరించారు. విద్యార్థులు పలు ప్రశ్నలు అడగ్గా వారికి ఎంతో ఓపికతో నవ్వుతూ సమాధానం ఇచ్చారు. అమ్మ పేరుతో మొక్కలు నాటించి వాటిని సంరక్షించాలని సూచించారు. పిల్లలను వారికి నచ్చిన చదువు చదివించాలని, ఇదిచదువు అదిచదువు అని బలవంతం చేయొద్దని కోరారు. అనంతరం పిల్లలు, తల్లిదండ్రులు, అధికారులతో ఆటలు ఆడారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సామాన్య వ్యక్తిగా కలెక్టర్ కలిసిపోవడం చూసి అంతా ఆశ్చర్యపోయారు.

భవిష్యత్తును తీర్చిదిద్దేది చదువే..

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చదువు ఎదుగుదలకు దోహదం చేస్తుందని, అభివృద్ధికి మార్గం చూపుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మరడాం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణం, జూనియర్ కళాశాలలోనూ గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య మన భవిష్యత్తును తీర్చిదిద్దుతుందన్నారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులు తయారు చేసిన మెగా పీటీఎం సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగారు. అలాగే రంగోళి, టగ్ ఆఫ్ వార్ పోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో మోహనరావు, తహసీల్దార్ పి.విజయభాస్కర్, ఎంపీడీవో వైవి.రాజేంద్రప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ గణపతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి శ్రీనివాస్



ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలంగా ఉన్నకాలంలో జనాభా వృద్ధి శాతం దినదినాభివృద్ధి చెందేది. తర్వాత కాలంలో అనేక కారణాల వల్ల జననాలు తగ్గుతున్నాయి. గతంలో ప్రభుత్వాలే ఇద్దరు కంటేఎక్కువ మంది పిల్లలను కనేవారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించబోమని చెప్పాయి. నేడు అధిక సంతానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అయితే ప్రజల ఆలోచనల్లో మార్పులు రావడం.. చిన్న కుటుంబాలుగా విడిపోవడం.. ఖర్చులు ఆకాశానికి ఎగబాకడం.. విద్య, వైద్యంపై వ్యయం అంచనా తప్పడం.. ఇద్దరు పిల్లలను కన్నాక ఆరోగ్యం సహకరించకపోవడం.. ఆలస్య వివాహాలు తదితర కారణాల వల్ల శిశువృద్ధి రేటు తగ్గుతూ వస్తోంది. ఏ వయసులో పెళ్లి జరిగినా కూడా ఒకరిద్దరుతో సరిపెడుతున్నారు.

ఒకరిద్దరితో సరి!



- సంతానోత్పత్తిలో పొదుపు పాటిస్తున్న జంటలు
- ఎక్కువ మంది పిల్లలను కనాలంటున్న ప్రభుత్వాలు
- నానాటికీ తగ్గుతున్న జనాభా పెరుగుదల శాతం
- ఆర్థిక ఇబ్బందులు, ఉమ్మడి కుటుంబాలు లేకపోవడమూ కారణమే
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



శృంగవరపుకోట/విజయనగరం కలెక్టరేట్/రింగురోడ్డు, జూలై10 (ఆంధ్రజ్యోతి): 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా 23.44 లక్షలు. ప్రస్తుతం 24.88 లక్షలు ఉండొచ్చునని అంచనా. ఈ పద్నాలుగు ఏళ్లలో 1.44 లక్షల జనాభా పెరగొచ్చని భావిస్తున్నారు. జిల్లా విభజన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడడం.. శ్రీకాకుళంలోని రాజాం నియోజకవర్గం వచ్చి చేరిన నేపథ్యంలో జిల్లా జనాభా 19.30 లక్షలు ఉండొచ్చునని మరో అంచనా. కాగా రానురాను జనాభా వృద్ధి రేటు తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి వెయ్యిమంది జనాభాలో నెలకు రెండు జననాలు ఉండాలని వైద్య (మిగతా 8వ పేజీలో..)

అప్పట్లో ఎక్కువ మంది పిల్లలను కనేవారు

మా రోజుల్లో ఎక్కువ మందిని కనేవారం. పుట్టేవారిలో శిశుమరణాలు ఎక్కువగా ఉండేవి ఆ భయంతో ఎక్కువ మందిని కనేవారం. ప్రస్తుతం ఆసుపత్రులు పెరిగాయి. శిశు మరణాలు తగ్గాయి. పిల్లలు ఎక్కువ మంది ఉంటే కుటుంబానికి బలం. అప్పట్లో పిల్లలను పెంచడం కూడా కష్టం అనుకోలేదు.

అప్పయ్యమ్మ (ఏడుగురు పిల్లల తల్లి), గంట్యాడ

శిశువృద్ధి రేటు తగ్గుతోంది

వైద్య సదుపాయాలు పెరిగినా ఇద్దరు కంటే ఎక్కువ మంది బిడ్డలను కనేందుకు ముందుకు రావడం లేదు. ఇద్దరు పిల్లలు చాలని మానసికంగా ముందే సిద్ధమౌతున్నారు. కుటుంబ నియంత్రణపై బాగా అవగాహన పెరగడం, యాంత్రీకరణ జీవన విధానాలతో పిల్లలను సరిగా చూసుకోలేమనే భావన కూడా ఉండటంతో శిశువృద్ధి రేటు తగ్గుతోంది.

- సన్యాసమ్మ, స్త్రీ వైద్య నిపుణురాలు

పిల్లలను కనేలా ప్రోత్సహిస్తున్నాం

గతంలో కంటే ఇప్పుడు శిశుమరణాల రేటు చాలా వరకు తగ్గింది. ప్రసావాలు ఆసుపత్రుల్లో జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. అవకాశం ఉన్నవారు ఎక్కువ మంది పిల్లలను కనేలా తమ సిబ్బంది క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

- జీవనరాణి, జిల్లా వైద్యాధికారి

మత్స్యకారులు క్షేమంగా ఇంటికి..

- గుర్రపు డెక్కలో కొన్ని గంటల పాటు ఇరుక్కుపోయిన వైనం

వంగర, జూలై 10(ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్‌లో చేపల వేటకు బుధవారం సాయంత్రం వెళ్లి గల్లంతైన మత్స్యకారులు దాసరి రాము, ఆదినారాయణ అతి కష్టం మీద తోటి మత్స్యకారుల సహాయంతో రాత్రి 2 గంటల సమయంలో ఒడ్డుకు చేరారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కొన్ని గంటల పాటు వారి కుటుంబ సభ్యులు టెన్షన్ పడ్డారు. మడ్డువలస గ్రామానికి చెందిన వీరు వరుసకు తండ్రీకుమారులు. ఇద్దరూ నాటు పడవపై చేపల వేటకు వెళ్లి రాత్రివరకూ ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడి అందరికీ చెప్పారు. వెంటనే పలువురు మత్స్యకారులు నాటు పడవలతో రిజర్వాయర్‌లో వెతకడం ప్రారంభించిన సంగతి తెలిసిందే. రిజర్వాయర్ మధ్యలో ఉన్న గుర్రపుడెక్కలో చిక్కుకుని ఉన్నట్లు భావించారు. కానీ అక్కడికి వెళ్లలేకపోయారు.

ఆ తర్వాత ఇంజనీరింగ్ సిబ్బంది, పోలీసులు తమ వద్ద ఉన్న ఆధునిక బోట్లపై వెళ్లారు. అనంతరం మత్స్యకారులను గుర్తించారు. అతి కష్టం మీద వీరి బోటులోకి లాక్కొని రక్షించారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రక్రియంతా బుధవారం రాత్రి 2 గంటల సమయంలో జరిగింది.



ఒడ్డుకు చేరిన మత్స్యకారులతో పోలీసులు

7లో
డివైడర్ అవతలికి దూసుకెళ్లిన వ్యాన్
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరి దుర్మరణం.. మరొకరికి గాయాలు
- వ్యాన్ అదుపు తప్పడంతో ఘటన

ప్రతి కుటుంబంలో సంతోషమే లక్ష్యం
7లో
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- విజినిగిరిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'కు హాజరు

టీడీపీ కార్యాలయానికి స్థల పరిశీలన
7లో



నగరపాలక సంస్థకు ద్వితీయ స్థానం
- పారిశుధ్య నిర్వహణలో గుర్తింపు
- 64.09 శాతం వృద్ధి రేటు
- కమిషనర్ నల్లనయ్య
7లో

వెదురువాడ కొండపై ఏనుగులు
6లో
- ఘీంకారాలతో స్థానికుల్లో వణుకు
- అరటి, జీడిమామిడి, పనస, పైనాపిల్ పంటల ధ్వంసం

సింహగిరి ప్రదక్షిణ చేసి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- కన్నీరు తెప్పించిన తల్లి రోదన
- బాధితులది శ్రీకాకుళం జిల్లా





భోగాపురం, జూలై10(ఆంధ్రజ్యోతి): 'కొడుకా దైవ దర్శనానికి వెళ్లి వస్తానన్నావురా.. దేవుడు దగ్గరకే వెళ్లిపోయావా.. మాకు దిక్కెవరురా నాయనా, నీవే ప్రాణంగా బతుకుతున్నాంరా నాయనా, నిన్ను మరవలేమురా కొడుకా' అంటూ భోగాపురం మండలం సుందరపేట సీహెచ్‌సీ ఆవరణలో కుమారుడి మృతదేహం వద్ద ఓ తల్లి రోదిస్తుండడం చూసిన వారంతా కన్నీరు పెట్టారు. సింహాచలంలో గిరి ప్రదక్షిణ ముగించుకుని గురువారం ఉదయం స్నేహితుడు తుర్ల చిన్నారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్న రావాడ ఉదయ్‌కుమార్(28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. చిన్నారావు గాయపడగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఉదయ్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో ఉదయ్ స్వగ్రామం.. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం (మిగతా 8వ పేజీలో..)

విచారంలో తల్లిదండ్రులు లక్ష్మీ, రమణయ్య.. (ఇన్‌సెట్)లో ఉదయ్‌కుమార్ ఫైల్ ఫొటో

ఘనంగా గురుపౌర్ణమి

గురుపౌర్ణమి పురస్కరించుకుని గురువారం జిల్లాలోని షిర్డీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయినామంతో మార్మోగాయి. భక్తులు స్వామికి విరివిగా అన్నాభిషేకాలు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

7లో



ఎస్.కోటలో సాయినాథునికి పూజలు

దేవాడలో కదలిక

- మైనింగ్ దోపిడీపై లోతుగా ఆరా
- దర్యాప్తు చేపట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు
- సందర్శించిన జిల్లా అధికారుల బృందం

గరివిడి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దేవాడ మైనింగ్ బ్లాకులో రెండు సంవత్సరాల నుంచి జరుగుతున్న మైనింగ్ తవ్వకాలపై గురువారం జిల్లా అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. దోపిడీపై లోతుగా ఆరా తీశారు. ఈ బ్లాకులో దేవాడ, కోడూరు, కొండపాలెం, దువ్వాం తదితర పంచాయతీలకు సంబంధించిన 82 ఎకరాల్లో మైనింగ్ తవ్వకాలకు సంబంధించి గత ప్రభుత్వం అధికారంలోకి ఉన్నప్పుడు టెండర్లు ప్రకటించారు. మహలక్ష్మీ మినరల్స్ సంస్థ తవ్వకాలకు అనుమతులు పొందింది. అయితే ఈ మైనింగ్ బ్లాకులో ఏడాదికి 2 లక్షల టన్నులు తవ్వాల్సి ఉండగా గత (మిగతా 8వ పేజీలో..)



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం సాలూరు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ఇంటర్‌లో 967 మార్కులు సాధించిన కే.రోహిత్‌నాయుడును మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా రోహిత్‌నాయుడుకు అమరావతి విట్స్‌లో ఇంజనీరింగ్ సీటు రావడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివి లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తల్లిదండ్రులను అర్థం చేసుకుని వారు మన కోసం ఎంతో కష్టపడుతున్నారన్నారు. వారిని బాధపెట్టకూడదన్న పరిపక్వత విద్యార్థులకు రావాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు వల్ల తల్లిదండ్రులకు నమ్మకం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం కలుగుతాయన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా విద్యాశాఖాధికారి డి.రాజకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అల్లు సత్యవతి, హైస్కూల్ హెచ్ఎం ఎన్.జ్యోతి, తహసీల్దార్ నీలకంఠరావు, ఎంపీడీవో జి.పార్వతి, ఎంఈవో ఎన్.వెంకటరావు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

ఉన్నత స్థాయిలో ఉంచేందుకే వ్యవస్థలో మార్పులు..

గరుగుబిల్లి, జూలై10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నత స్థాయిలో ఉంచేందుకు కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకువస్తోందని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం రావివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా లోకేష్ బాధ్యతలను చేపట్టినప్పటి నుంచి మెరుగైన బోధన అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే మన్యం జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేయడంతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. తదుపరి రాష్ట్రస్థాయిలో మన్యం జిల్లాకు తగిన గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం ప్రతిభకనపర్చిన విద్యార్థులకు మెమొంటోలు, బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి డాక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డి, పార్టీ ప్రతినిధులు వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్, దత్తి లక్ష్మణరావు, కోట భరత్‌కుమార్, ఎం.పురుషోత్తంనాయుడు, తవిటినాయుడు, ఎ.మధుసూదనరావు, సత్యనారాయణ, ఎ.రాంబాబు, ఎంపీడీవో జి.పైడితల్లి, తహసీల్దార్ పి.బాల, తదితరులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు..

సీతంపేట రూరల్, జూలై10 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తోందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీ లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థుల కోసం తల్లికి వందనం, విద్యాదీవెన కిట్లు ఇప్పటికే అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా విద్యారంగం వెనుకబడిందని విమర్శించారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో విద్యారంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. తనవంతుగా కేజీబీవీకి రెండు ఇన్వర్టర్‌లను అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంధ్యారాణి, పాలకొండ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి, తహశీల్దార్ శ్రీకన్య, ఎంఈ వో ఆనందరావు, సవర మాలయ్య, ప్రసాద్, అనిల్‌కుమార్, ఉదయాన ఉదయభాస్కర్, ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

● చదువుల్లో రాణించాలి..

విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సామరెల్లి పాఠశాలలో నిర్వహించిన మెగా టీచర్స్ పేరేంట్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రూ.4.50 కోట్లతో గురుకులాన్ని అభివృద్ధి చేస్తా..

బొబ్బిలి, జూలై10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రభుత్వ గురుకుల పాఠశాలను రూ.4.50 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం సందడిగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు, విద్యామంత్రి లోకేశ్ విద్యారంగాన్ని సమున్నతంగా తీర్చిదిద్దేందుకు నడుంబిగించారన్నారు. బొబ్బిలి గురుకుల పాఠశాలను సందర్శించాలని లోకేశ్‌ను స్వయంగా ఆహ్వానించానన్నారు. పూర్వవిద్యార్థుల సహకారంతో గురుకుల మనుగడ సాగించడమే కాకుండా సమాజానికి అత్యున్నతమైన పౌరులను అందిస్తుండటం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘునాథ్ పాఠశాల ప్రగతి నివేదికను సమర్పించారు. తహశీల్దారు మలపరెడ్డి శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ గురుకులం 12 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, దీనిని పక్కాగా సరిహద్దులను నిర్దేశించి ఎమ్మెల్యే దత్తత గురుకులానికి మంచిపేరు సాధిస్తామన్నారు. పూర్వవిద్యార్థి డాక్టర్ కృష్ణమూర్తి.. మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. పూర్వవిద్యార్థుల సహకారంతో పునర్నిర్మించిన కళావేదికను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు టగ్ ఆఫ్‌వార్, ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. సీఐ కటకం సతీష్‌కుమార్, విద్యాకమిటీ చైర్‌పర్సన్ గొర్లె కుమారి, వైస్ చైర్‌పర్సన్ బి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి గురుకులంలో కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

● పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో పండుగ వాతావరణంలో మెగా పేరెంట్ మీట్ నిర్వహించారు. తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ఆత్మీయ సమావేశాలతో సత్ఫలితాలు..

విజయనగరం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సమష్టిగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహించిన ఆత్మీయ సమావేశాలతో సత్ఫలితాలు రానున్నాయని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. నగరంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య లభిస్తున్నదన్నారు.

విద్యా రంగంలో గణనీయమైన మార్పులు..

చీపురుపల్లి, జులై 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో, విద్యా మంత్రి లోకేష్ సారథ్యంలో విద్యారంగంలో గణనీయమైన మార్పులు తీసుకుని రావడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. అనంతరం ఆయన విద్యార్థులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం తీసుకున్నారు. అంతకుముందు పాఠశాల ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ మామిడి శ్రీను ఆధ్వర్యంలో కేడెట్లు ఎమ్మెల్యేకు గౌరవ వందనం సమర్పించారు. హెచ్ఎం డి.ఉమామహేశ్వరి, కూటమి నాయకులు త్రిమూర్తులరాజు, కామునాయుడు, రామచంద్రుడు, నాగరాజు, రాంబాబు, ఆరతి సాహు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం..

నెల్లిమర్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సతివాడ ఆదర్శ పాఠశాలలో గురువారం జరిగిన పీటీఎం సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసేందుకు పీటీఎం సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, ఎడ్ల గోవిందరావు, చింతపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి..

శృంగవరపుకోట రూరల్, జూలై 10: పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎస్.కోట ఎమ్మెల్యే లలిత కుమారి అన్నారు. ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.



ఎస్.కోట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

● పింఛన్లలో అవినీతిపై కఠిన చర్యలు
● కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ అధికారులను కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టరు తమ క్యాంపు కార్యాలయంలో సంబంధిత అంశాలపై అధికారులతో సమావేశం అయ్యారు. క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు నివేదిక తెప్పించుకుని అందుకు అనుగుణంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని గ్రామాల్లో తాగునీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. 444 హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లకు గాను 38 సెంటర్ల పరిధిలో ఇంకా నీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. మెరకముడిదాం, సాతాంవలసలో పింఛన్లు మంజూరు చేయడానికి డబ్బులు వసూలు చేసినట్లు ఐవీఆర్ఎస్ ద్వారా తెలిసిందని కలెక్టరు చెప్పారు. దీనిపై తక్షణమే విచారణ చేసి నివేదిక అందజేయాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అంబేడ్కర్

మా సమస్యలు పట్టవా?

● వివిధ పార్టీల గొడుగులతో జిందాల్ నిర్వాసితుల వినూత్న నిరసన

శృంగవరపుకోట రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): 'మా ఓట్లు కావాలి గానీ.. మా సమస్యలు పట్టవా..' అంటూ జిందాల్ కంపెనీ నిర్వాసితులు అసహనం వ్యక్తం చేశారు. జిందాల్ యాజమాన్యం తమకు న్యాయం చేయాలని గత 21 రోజులుగా నిరసన చేపడుతున్నా అధికార, ప్రతిపక్ష నేతలు కనీసం తమ వద్దకు రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం బొడ్డవర గ్రామంలో వారంతా టీడీపీ, జనసేన, వైసీపీ రంగుల గొడుగులతో వినూత్నంగా నిరసన చేపట్టారు. నాయకుల్లో చిత్తశుద్ధి ఉంటే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



వివిధ పార్టీల గొడుగులతో నిరసన తెలియజేస్తున్న నిర్వాసితులు

శాకంబరిగా బంగారమ్మ

బొబ్బిలి, జూలై10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారమ్మ ఆలయంలో అమ్మవారిని గురువారం శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసంలో అమ్మవారిని శాకంబరిగా కొలిస్తే సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల విశ్వాసమని ఆలయ అర్చకుడు ప్రకాశ్ పండా అన్నారు. అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



శాకంబరిగా బంగారమ్మవారు

ఘనంగా గురుపౌర్ణమి

జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వాడవాడలా స్వామికి అన్నాభిషేకాలు నిర్వహించారు. అనేక చోట్ల ఊరేగింపులు చేపట్టారు. రోజంతా సాయినామంతో భజనలు చేశారు. భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం వరకూ ఆయా ఆలయాలు కిటకిటలాడాయి.



గరుగుబిల్లిలో స్వామి చిత్రపటంతో ఊరేగింపు



బొబ్బిలిలో స్వామికి పూజలు



వీరఘట్టంలో స్వామి చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు



చెలరేగుతున్న మంటలు

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

సాలూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెల్లివీధికి చెందిన గోండెల సురేష్ ఇంటిలో గురువారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగి ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. గ్యాస్ లీక్ కావడంతో ఇలా జరిగినట్లు చెబుతున్నారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. పట్టణ ఎస్ఐ రంజిత్‌కుమార్ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు.

285 బస్తాల యూరియా పట్టివేత

మక్కువ రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సన్యాసరాజపురంలో అక్రమంగా నిల్వ చేసిన 285 యూరియా బస్తాలను వ్యవసాయాధికారులు పట్టుకున్నారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనంలో నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు.



పట్టుకున్న యూరియా బస్తాలు

వెదురువాడ కొండపై ఏనుగులు

సీతంపేట రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో గిరిశిఖర గ్రామమైన వెదురువాడ సమీపంలో ఏనుగులు గుంపు ప్రత్యక్షమైంది. గడచిన కొన్ని రోజులుగా గోరపాడు, మోహనకాలనీ, చినబగ్గ గ్రామాల పరిసరాల్లో సంచరించిన గజరాజులు గురువారం వేకువజామున వెదురువాడ సమీపానికి వచ్చాయి. ఏనుగులు ఘీంకారాలు చేయడంతో హడలిపోయామని స్థానికులు తెలిపారు. అరటి, జీడి, మామిడి, పనస, పైనాపిల్ పంటలను ధ్వంసం చేసినట్లు సవర రాజారావు, ఆరిక పాతయ్య, సవర సీమ్యో, బిడ్డిక జుజారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులను తక్షణమే ఇక్కడి నుంచి తరలించాలని వారు కోరారు.



వెదురువాడ సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ

భోగాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ముంజేరు పంచాయతీ జగ్గయ్యపేట అంగన్‌వాడీ కార్యకర్త మంగమ్మపై అదే గ్రామానికి చెందిన ఎం.ఆదిలక్ష్మి ఇటీవల కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు, స్థానిక ఐసీడీఎస్ కార్యాలయానికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గురువారం భోగాపురం ఐసీడీఎస్ ప్రోజెక్టు ఏసీడీపీవో ఎల్.సుజాత, సూపర్‌వైజర్లు మంగ, డి.హేమ తదితర సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విచారణ చేపట్టారు. కార్యకర్త మంగతోపాటు కొంతమంది స్థానికులతో మాట్లాడారు. అయితే ఆదిలక్ష్మి అందుబాటులో లేదు. తర్వాత ఆదిలక్ష్మిని విచారించి పూర్తి నివేదికను సీడీపీవో లావణ్యకు అందజేస్తామని ఐసీడీఎస్ సిబ్బంది తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీపీటీవో

విజయనగరం రింగురోడ్డు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణికుల సమస్యలపై శుక్రవారం డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు విజయనగరం ఆర్టీసీ డీపీటీవో జి.వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 99592 25604కు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సమస్యలను తెలపాలని కోరారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి

విజయనగరం రింగురోడ్డు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పురమిత్ర యాప్ ద్వారా వచ్చిన ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చొరవ చూపాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.సిబ్బందికి నల్లనయ్య ఆదేశించారు. పురమిత్ర యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై ఆయన స్పందించి.. గురువారం నగరపాలక సంస్థ సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర, పురమిత్ర యాప్‌ల ద్వారా వచ్చే సమస్యలు, సౌకర్యాలు ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని తెలిపారు.

కూటమితో అభివృద్ధి సాధ్యం

గుర్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు అన్నారు. మండలంలోని నాగలవలస, గొలగాం, తాటిపూడి గ్రామాల్లో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వెన్నె సన్యాసి నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వర రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించాలి

రాజాం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం రాత్రి 24 వార్డుల నాయకులు, రూరల్ నాయకులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

శృంగవరపుకోట రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన సుమారు 50మంది విద్యార్థులకు రాజీపేటలో ఉన్న శంబలనగరి ఆశ్రమ ప్రతినిధులు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఆశ్రమంలో గురువారం నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా వీటిని అందజేశారు. వేడుకల్లో భాగంగా వేదమాత గాయత్రీదేవికి పూజలు చేశారు.

నేడు బైకు ర్యాలీ

భోగాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఏపీజేఏసీ చైర్మన్ విద్యాసాగర్, కార్యదర్శి దివి రమణ మొదటిసారిగా శుక్రవారం విజయనగరం వస్తున్న సందర్భంగా విజయనగరం వై జంక్షన్ నుంచి జడ్పీ కార్యాలయం వరకు భారీ బైకు ర్యాలీ ఉంటుందని భోగాపురం యూనిట్ చైర్మన్ కొమ్మూరు దుర్గారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సమస్యలపై జడ్పీ సమావేశ భవనంలో సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, పొరుగు సేవల సిబ్బంది పాల్గోవాలని ఆయన కోరారు.

నంది అవార్డు గ్రహీతలకు సత్కారం

విజయనగరం రింగురోడ్డు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పూల్‌బాగ్‌లో గురుపౌర్ణమి సందర్భంగా బీజేపీ నగర తూర్పు మండల అధ్యక్షుడు జమ్ము రాంబాబు ఆధ్వర్యంలో నాటక రంగంలో రాష్ట్ర నంది అవార్డు గ్రహీతలఄ మురళీధర్, పద్మ, చేతి వృత్తి కళాకారులు తిప్పాన పావనీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ, పార్టీ నాయకులు బూర జగ్గారావు, మొల్లి రామకృష్ణ, కొండేల శ్రీనివాసరావు, గిరీష్, సౌమ్య, జానకీ పాల్గొన్నారు.

జీజే కళాశాల ప్రిన్సిపాల్‌గా షణ్ముఖరావు

రాజాం, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా ఎం.షణ్ముఖరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎం.కామేశ్వరరావు జూన్ నెలలో పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సంతకవిటి నుంచి బదిలీపై వచ్చిన షణ్ముఖరావుకు ఉన్నతాధికారులు ఎఫ్ఏసీ బాధ్యతలను కట్టబెట్టారు.

విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- పండుగ వాతావరణంలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్

విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వక్తలు తెలిపారు. మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంగా గురువారం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొని, మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



నెల్లిమర్లలో మాట్లాడుతున్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు



సంతకవిటి: జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్న విద్యార్థులు



రాజాం రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లులకు పాద పూజ



గరివిడి: గొట్నంది ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు



డెంకాడ: అక్కివరం పాఠశాలలో బహుమతులు అందిస్తున్న మాజీ ఎంపీపీ చంద్రశేఖరరావు



ఎస్.కోట రూరల్: ఎస్.కోట బాలికోన్నత పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు



గజపతినగరం: గంగచోళ్లపెంట ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో మోహనరావు

ప్రతి కుటుంబంలో సంతోషమే లక్ష్యం

- మంత్రి శ్రీనివాస్

జామి, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబంలో సంతోషం చూడటమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజినిగిరి గ్రామంలో గురువారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, నాయకులు స్వామినాయుడు, అప్పలరాజు, రాయవరపు ఆదిలక్ష్మి, వెలమ కార్పొరేషన్ డైరక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మివర్రి రమణ తదితరులు ఉన్నారు.



జామి: విజినిగిరిలో గ్రామస్థులతో మంత్రి శ్రీనివాస్

ఈ ప్రభుత్వం మీది..

శృంగవరపుకోట రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'ఈ ప్రభుత్వం మీదని, మేము మీ సేవకులం' అని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం రేవళ్లపాలెం గ్రామంలో ఆమె సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వ పాలనపై అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ నాయుడు, జుత్తాడ రామసత్యం, గోపాలపల్లి సర్పంచ్ ఉమమహేశ్వరరావు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న పాల్గొన్నారు.



ఎస్.కోటరూరల్: కరపత్రం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చీపురుపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. సుపరిపాలన తొలి అడుగులో భాగంగా మండలంలోని అలజంగిలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మామిడి రైతుల పరామర్శ పేరుతో జగన్ చేసిన హైడ్రామా రాష్ట్ర ప్రజలు గమనించారన్నారు. మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి స్థల పరిశీలన

విజయనగరం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యాలయానికి ఆ పార్టీ నాయకులు గురువారం స్థల పరిశీలన చేశారు. గాజులరేగలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిర్మించతలపెట్టిన ఈ కార్యాలయ నిర్మాణానికి ఆగస్టు నెలలో శంకుస్థాపన జరగనున్నది. ఈనేపథ్యంలో టీడీపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిమిడి నాగార్జున, ఐవీపీ రాజు, ఇతర టీడీపీ నాయకులు పరిశీలించి, దీనిపై మండల సర్వేయర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనకల మురళీమోహన్, బొద్దల నర్సింగరావు, అల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు, కంది మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

రాజాం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలు రూ.10వేలకు పెంచాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాజాం ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. వంటకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని, మెనూ చార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.20 వంతున ఇవ్వాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, ఏడాదిలో 12 నెలల వేతనాలు చెల్లించాలని, పని భద్రత కల్పించి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని వినతి ప్రతంలో పేర్కొన్నారు. రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీఎం కార్మికులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీల శిక్షణకు కమిటీ వేయడంపై హర్షం

విజయనగరం రింగురోడ్డు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీల శిక్షణకు కమిటీ వేయనున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించడంపై సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. విజయనగరంలోని ఆ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జ్యోషి పాల్గొని, మాట్లాడారు. శిక్షణతో తమ వృత్తికి తగిన గుర్తింపు, చట్టబద్ధత లభిస్తాయన్నారు. ప్రతినిధులు కోట పైడిరాజు, కర్రి సత్యనారా యణ, గుప్తా, మక్కువ రమణ, భవానీ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్లలో పనుల కారణంగా చీపురుపల్లి పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ డీఈ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే పీకే పాలవలస, గచ్చలవలస, పుర్రేయవలస విద్యుత్ స్టేషన్ల పరిధిలో రామలింగపురం, అలజంగి, మెట్టపల్లి, కరకాం, కర్లాం, పాలవలస, నిమ్మలవలస, పెదనడిపల్లి, ములగాం గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. ● విజయనగరం రింగురోడ్డు: నగరంలోని కలెక్టరేట్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పి.త్రినాథ్‌రావు తెలిపారు. ఈ కారణంగా కేఎల్‌పురం, కణపాక, సంజీవయ్యకాలనీ, భవానీ నగర్, బీసీ కాలనీ, ఆర్డీవో కార్యాలయం, సాయి లలితానగర్, సాయి కీర్తన నగర్, ద్వారపూడి రోడ్డు, కోయినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు వివరించారు. ● భోగాపురం: మండలంలోని గుడివాడ, ఎరుసుపేట, మద్దిపేట గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆ శాఖ ఏఈ మస్తాన్‌వల్లి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'తొలి అడుగు'ను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నియోజకవర్గ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కోరారు. గురువారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించి న నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావే శంలో ఆమె మాట్లాడారు. ఏడాదిలో ప్రభుత్వం ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నియోజకవర్గంలో ఏడాదిలో నిర్వహించిన అభివృ ద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరప త్రాన్ని ఆమె టీడీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా ముగ్గురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, బొద్దల నర్సింగరావు, అల్తి బంగారుబాబు, కర్రోతు నర్సింగరావు, అనురాధ బేగం, గంటా పోలినాయుడు, కంది మురళీ నాయుడు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి, టీడీపీ నాయకులు

అర్హులందరూ ఓటు హక్కు పొందాలి: ఆర్డీవో

చీపురుపల్లి, జూలై 10 (ఆంధ్ర జ్యోతి): అర్హు లందరూ ఓటు హక్కు పొందేలా బీఎల్వోలు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో బి.ఆసయ్య ఆదేశించారు. గురువారం చీపురుపల్లిలోని తన కార్యా లయంలో జరిగిన చీపురుపల్లి, గరివిడి మండలాల బీఎల్వోల శిక్షణలో ఆయన మాట్లాడారు. ఫారం 6, 6ఏ, 7, 8ల స్వీకరణ సమయంలో, విచారణ సమయంలో బీఎల్వోలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ఓటరు జాబితాల నిర్వహణలో అవసరమైన నియమాలను పాటిం చాలన్నారు. ఈ శిక్షణలో చీపురుపల్లి తహసీల్దార్ డి.ధర్మరాజు, ఎన్నికల డీటీ హర్షవర్ధిని, ఇతర ఎన్నికల సిబ్బంది, రెండు మండలాల బీఎల్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో ఆసయ్య

ఓటర్ల జాబితా తయారీలో అప్రమత్తం

నెల్లిమర్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): కచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి బూత్ లెవల్ అధికారులు అంకితభావంతో పనిచేయాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఫారెస్టు సెటిల్మెంట్ అధికారి ఎం.నూకరాజు సూచించారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఐదు రోజులపాటు జరగనున్న బీఎల్వో శిక్షణా సమావేశానికి డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు గురువారం అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలను అనుసరించి జాబితా తయారు చేయాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు, మరణించిన వారి పేర్లు తొలగించాలన్నారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు రాజకీయ పక్షాల ప్రతినిధులు సహకారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.శ్రీకాంత్, ఎంపీడీవో కార్యాలయ ఏపీ సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించాలి

నెల్లిమర్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో వీధి కుక్కలను తగ్గించేలా చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక నగర పంచాయతీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వీధి కుక్కల దాడితో చాలా మంది గాయాలపాలయ్యారని, పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. కుక్కల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పారిశుధ్య కార్మికులకు ఇంతవరకు వేతనాలు చెల్లించలేదని చెప్పారు. మృతిచెందినవారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల జీతాలు మూడు రోజుల్లో చెల్లిస్తామని, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అదుపు తప్పి.. డివైడర్ అవతలికి దూసుకెళ్లిన వ్యాన్

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరి దుర్మరణం.. మరొకరికి గాయాలు

రణస్థలం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రణస్థలం వద్ద జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్ సమీపంలోగల జాతీయ రహదారిపై శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న వాహనం అదుపు తప్పి అవతలి మార్గం వైపు దూసుకెళ్లింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిలో ఒకరు దుర్మరణం పాలవ్వగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. జేఆర్‌పురం పోలీసుల కథనం మేరకు.. రాజాంకు చెందిన పరమేశ్వర్‌రెడ్డి (31), శ్రీకాకుళం హుడా కాలనీకి చెందిన కనకరాజు ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తున్నారు. జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్ సమీపంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న ఐషర్ వాహనం అదుపు తప్పి డివైడర్ దాటి అవతలి మార్గంలో వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే ధర్మల పరమేశ్వర్ రెడ్డి మృతిచెందారు. కనకరాజు అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు జేఆర్‌పురం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయపడిన కనకరాజును శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. పరమేశ్వర్‌రెడ్డితో పాటు కనకరాజు మెడికల్ రిప్రజెంటుల్లుగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తుండగా ప్రమాదం జరిగింది. జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

బెలగాం/కొమరాడ, జూలై10 (ఆంధ్రజ్యోతి): భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానాను విధిస్తూ రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ఎస్.దామోదరరావు తీర్పు చెప్పారని ఎస్పీ మాధవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమరాడ మండలం నయా గ్రామానికి చెందిన మండంగి గణపతి తన భార్య పులమ్మను 2019న మే 26న రాత్రి 11 కత్తితో పొడిచి హత్య చేశాడు. దీనిపై అప్పట్లో కొమరాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి ఎస్ఐ ఎం.రాజేష్, పార్వతీపురం రూరల్ సీఐ జి.రాంబాబు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో తగిన సాక్ష్యాధారాలు సమర్పించారు. గణపతి చేసిన నేరం రుజువు కావడంతో ఆయనకు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారని ఎస్పీ వివరించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

గజపతినగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ కాలనీలో చోరీకి పాల్పడిన నిందితులను పట్టుకుని అరెస్టు చేశామని సీఐ జీఏవీ రమణ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా గోరంట్ల గ్రామానికి చెందిన చిల్లర సురేష్, జల్లేపల్లి వెంకటేశ్వరరావు, దాసరి సుభాష్, విజయవాడ రామలింగేశ్వర కాలనీకి చెందిన నాగవీర భాస్కరరావులు గురువారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ఈ మేరకు సిబ్బంది సహాయంతో దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం అంగీకరించారని చెప్పారు. ఈనెల 1వ తేదీన కారును అద్దెకు తీసుకుని సాలూరు మండలంలోని మక్కువ గ్రామంలో శంబర పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో సాలూరు పట్టణంలో తాళంవేసి ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడ్డారని ఆయన తెలిపారు. అనంతరం తిరుగు ప్రయాణంలో గజపతినగరం రైల్వేస్టేషన్ కాలనీలో తాళంవేసి ఉన్న పాండ్రంకి పార్వతి ఇంటిలో చోరీకి పాల్పడ్డారని చెప్పారు. 200 గ్రాముల వెండి, రూ.10వేల నగదు చోరీ జరిగినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. నిందితుల నుంచి 200 గ్రాముల వెండితో పాటు రూ.1150నగదు, కారును సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నగరపాలక సంస్థకు ద్వితీయ స్థానం

విజయనగరం రింగురోడ్డు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పౌరసేవల్లో భాగంగా పారిశుధ్య నిర్వహణలో రాష్ట్రంలో వున్న 17 నగరపాలక సంస్థల్లో చేపడుతున్న చర్యలపై ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో విజయనగరం నగరపాలక సంస్థ ద్వితీయ స్థానంలో నిలిచిందని కమిషనర్ పి.నల్లనయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 17 నగరపాలక సంస్థల్లో అందిస్తున్న పౌర సేవలపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో 64.09 శాతం వృద్ధి రేటు సాధించిన నగరపాలక సంస్థ ద్వితీయ స్థానంలో నిలవడం అందరి కృషి ఫలితమేనన్నారు. ప్రధానంగా ఇంటింటి చెత్త సేకరణ, కాలు వల్లో చెత్త తొలగింపు, వీధుల్లో చెత్త కుప్పలు లేకుండా నిర్వహించడం వంటి చర్యలను ప్రాధాన్యత అంశాలుగా తీసుకుని చేపట్టిన ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణలో ఉత్తమ ప్రగతిని సాధించిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోనే తొలిస్థానం సాధించేందుకు మరింత కృషి చేస్తామని తెలిపారు.

అహీర్ రెజిమెంట్ యాదవుల హక్కు

విజయనగరం రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): అహీర్ రెజిమెంట్ యాదవుల హక్కు అని నినదిస్తూ కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకూ నిర్వహిస్తున్న 'రెజంగ్లా పవిత్ర వాహన కలశ యాత్ర' ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, నాతవలస మీదుగా గురువారం రాత్రి విజయనగరం చేరుకుంది. ఈ యాత్రకు విజయనగరంలోని కొత్తపేట, రాధాకృష్ణ జంక్షన్‌లో జిల్లా యాదవ సంక్షేమ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా యాదవ సంఘం నాయకులు ముచ్చి రామలింగస్వామి, ఇప్పిలి అప్పలకొండ, గదుల సత్యలత, ముద్దాడ మధు, బొడ్డాన అప్పారావు, గువ్వల తిరుప తిరావు, కొయ్యాన సన్యాసిరావు తదితరులు ఈ యాత్రకు స్వాగతం పలికారు. అంతకముందు కొత్తపేట నీళ్లట్యాంకు జంక్షన్‌లో పాదయాత్ర నిర్వహించి, కరపత్రాలను పంపిణీ చేశారు.



రెజంగ్లా పవిత్ర కలశంతో యాదవ సంక్షేమ సంఘం నాయకులు

ఘనంగా గురుపౌర్ణమి

- కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు

గురుపౌర్ణమి సందర్భంగా గురువారం విజయనగరం జిల్లాలోని షిరిడీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



చీపురుపల్లి: పట్టణంలోని కస్పా వీధిలో..



భోగాపురంలో..



కొత్తవలస: తుమ్మికాపల్లి గేట్ సమీపంలో..

ఒకరిద్దరితో సరి!

(ఐదో పేజీ తరువాయి)

ఆరోగ్యశాఖ లెక్క. ఇందుకు భిన్నంగా నమోదవుతోంది. ఉదాహరణకు వేపాడ మండల పరిధిలోని ఓ గ్రామ జనాభా రెండు వేలు. వెయ్యికి ఒకరి చొప్పున నెలకు రెండు జననాలు ఉండాలి. ఈ లెక్కన ఆ గ్రామంలో ఏడాదికి 48మంది జన్మించి ఉండాలి. కానీ 28 జననాలు కూడా నమోదు లేదు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి. వైద్య ఆరోగ్య శాఖ నివేదికను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది.

ఎక్కువ జనాభా కోసం వైద్య ఆరోగ్య శాఖ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను ఆపేసింది. ఇద్దరి కంటే ఎక్కువ మందికి జన్మనివ్వాలని సూచిస్తోంది. మారిన పరిస్థితుల కారణంగా ఇందుకు ఎవరూ సాహసించడం లేదు. ఒకరిద్దరు పిల్లలతో సరిపెట్టేస్తున్నారు. జనాభా పెరుగుదలను అరికట్టేందుకు 1970నుంచి ఇద్దరు పిల్లలు ముద్దంటూ పిలుపునిచ్చిన ప్రభుత్వాలు 1990నాటికి ఒక్కరుంటే చాలన్న నినాదాలను ఒంటపట్టించాయి. అధిక సంతానం ఉన్న కుటుంబాలకు పథకాలు, రాయితీలను తొలగించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి కూడా అనర్హునిగా పరిగణించింది. దీనికి తోడు రానురాను ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాయి. దీంతో పిల్లల పెంపకం, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించడం భారం కావడంతో ప్రతి జంట ఒకరిద్దరి పిల్లలు చాలనుకుంటున్నారు. దీంతో జనాభా పెరుగుదల శాతం తగ్గిపోయింది. సరాసరి వయసు పెరిగి, పనిచేసే వారి సంఖ్య తగ్గుతోంది. ఫలితంగా ఆర్థికాభివృద్ధి కుంటుపడడం, ప్రజారోగ్యం మీద ఖర్చు పెరగడం, పన్నుల భారం మీద పడడం జరుగుతోంది.

కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం వంటి నిధులు కేటాయిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనలో పార్లమెంటు స్థానాల పెంపునకు జనాభానే ప్రాతిపదికగా తీసుకున్నారు. ఉత్తరాది రాష్ట్రాలు అప్పట్లో కుటుంబ నియంత్రణను పెద్దగా పాటించక ఆ రాష్ట్రాల్లో జనాభా బాగా పెరిగింది. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను చక్కగా పాటించడంతో ఒకరిద్దరు పిల్లలకే జన్మనిచ్చారు. ఫలితంగా జనాభా తగ్గుతూ వచ్చింది. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ పార్లమెంటు స్థానాలు పెరుగుతాయని దక్షణాది రాష్ట్రాలు భయపడుతున్నాయి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కువ మందికి జన్మనివ్వాలని సూచిస్తున్నారు. ఇందుకు ప్రోత్సాహంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరి కంటే ఎక్కువ పిల్లల నిబంధనను సడలించారు. వైద్య ఆరోగ్య శాఖ జనాభా పెరుగుదలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడం మానేసింది. వివాహ వయసు వచ్చిననాటి నుంచి మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా చూస్తున్నారు. అయినప్పటికీ జనన రేటు తగ్గుతోంది. వివాహ జంటలు ఇద్దరు లేదా ఒకరునే కోరుకుంటున్నారు. ఎక్కువ మందికి జన్మనిస్తే వైద్య ఖర్చులు భరించలేకపోవడం, మెరుగైన విద్యను అందించడం కష్టమవడం వంటి వాటిని దృష్టిలో పెట్టుకొని పరిమిత సంతానం కంటున్నారు. గతంలో కుటుంబాలు వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడేవి. ఎందురున్నా ఏదో ఒకపని చేసుకొని బతకొచ్చునని భావించేవారు. ఇప్పుడు ప్రతి ఒక్కరు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని కలలు కంటున్నారు. అందుకోసం విద్యపై అధికంగా ఖర్చుపెడుతున్నారు. వైద్యం ఖర్చు కూడా ఇంతలింతలుగా పెరిగిపోయింది. ఈ వ్యయాన్ని భరించేందుకు ఇద్దరు కంటే ఎక్కువ సంతానం ఉంటే కష్టమనే భావనతో అందరూ ఉన్నారు.

సింహగిరి ప్రదక్షిణ చేసి వస్తూ..

(ఐదో పేజీ తరువాయి)

మాకివలసలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసన్నపేట మండలం మాకివలసకు చెందిన ఇద్దరు స్నేహితులు రావాడ ఉదయ్, తుర్ల చిన్నారావు బుధవారం ద్విచక్రవాహనంపై సింహాచలం వెళ్లారు. అక్కడ రాత్రంతా గిరి ప్రదక్షిణ చేశారు. గురువారం ఉదయం సింహాచలంలో దైవదర్శనం చేసుకొని ఇంటికి తిరుగుప్రయాణం అయ్యారు. భోగాపురం మార్కెట్ సమీపంలో జాతీయ రహదారిపై బ్రిడ్జిపైకి చేరుకుంటుండగా డివైడర్‌ను ఢీకొట్టారు. రావాడ ఉదయ్ తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చొన్న స్నేహితుడు తుర్ల చిన్నారావుకు తీవ్రగాయాలయ్యాయి. చిన్నారావును చికిత్స కోసం తగరపువలస ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఉదయ్ మృతదేహాన్ని సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకొన్న కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు రావాడ లక్ష్మి, రమణయ్య కుమారుని మృతదేహం వద్ద కన్నీరు మున్నీరయ్యారు. ఉదయ్ డిగ్రీ పూర్తి చేశాడు. పెళ్లి చేయడానికి తల్లిదండ్రులు ప్రయత్నాలు చేస్తున్నారు. అంతలోనే ఆ కుటుంబానికి కోలుకోలేని కష్టం వచ్చింది. ఉదయ్‌కు చెల్లి సంధ్య ఉంది. సీఐ దుర్గాప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవాడలో కదలిక

(ఐదో పేజీ తరువాయి)

రెండు సంవత్సరాల్లో 10 లక్షలకుపైగా టన్నులు తవ్వారనేది ఆరోపణ. దీనిపై మూడు నెలల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో దేవాడలో మైనింగ్ దోపిడీ శీర్షికన కథనం కూడా వచ్చింది. తాజాగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దేవాడలో జరుగుతున్న మైనింగ్ తవ్వకాలపై దర్యాప్తు చేపట్టి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు గురువారం అమరావతి నుంచి ఆదేశాలు అందాయి. స్పందించిన జిల్లా అధికారులు డిప్యూటీ కలెక్టర్ మురళీ, మైనింగ్ ఇన్‌స్పెక్టర్లు రాంబాబు, తహసీల్దార్ బంగార్రాజు తదితర అధికారుల బృందం గురువారం మధ్యాహ్నం మైనింగ్ జరుగుతున్న ప్రదేశాల వద్దకు వెళ్లి పరిశీలించారు. అసలు మైనింగ్ ఎన్ని టన్నులు, ఎంత విస్తీర్ణంలో అనుమతులు పొందారు... ప్రస్తుతం మైనింగ్ తవ్వకాలు ఏ విధంగా ఉన్నాయి.. తెలుసుకునేందుకు నిశితంగా పరిశీలించారు. పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని జేసీ మైనింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు మహలక్ష్మీ మినరల్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అండదండలతో అక్రమంగా అనుమతులు పొందారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దర్యాప్తులో నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్, జూలై10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సౌందర్య థియేటర్ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో గురువారం ఎమ్మెల్యే విజయచంద్ర జన్మదిన వేడులకలు ఘనంగా నిర్వహించారు. తొలుత బైపాస్ రహదారిలోని షిర్డీసాయిబాబా, ఇప్పలపోలమ్మ ఆలయాలను అభిమానులతో పాటు ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జన్మదినాన్ని పురష్కరించుకొని ఏర్పాటు చేసిన మెగా వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనతో పాటు, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరీ, నిమ్మక జయకృష్ణ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేకును ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులతో పాటు కట్ చేశారు. కార్యక్రమంలో కొప్పల వెలమ సంక్షేమ సంఘం డైరెక్టర్ జి.వెంకటనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు జి.గౌరీశ్వరీ, నాయకులు జి.వెంకటరమణ, గౌరీ, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వై.వివేక్ పాల్గొన్నారు.

విప్లవ వీరులకు నివాళి

కురుపాం, జూలై10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాట వీరులు కామ్రేడ్స్ వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం వర్ధంతిని మండలంలోని గుమ్మ గ్రామంలో గురువారం నిర్వహించారు. మాజీ సమితి అధ్యక్షరాలు వెంపటాపు భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రేబ్బా లోవరాజు వారికి నివాళులర్పించారు.

గజరాయనివలసలో 'తొలి అడుగు'



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే, బుడా చైర్మన్‌లు

బాడంగి, జూలై10 (ఆంధ్రజ్యోతి): గజరాయనివలసలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కొన్ని అమలు చేశామని చెప్పారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవి, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ, పెదపల్లి సర్పంచ్ ఆవు సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పాలవలస గౌరు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మండలంలోని గొల్లాదిలో గురువారం సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే బేబీనాయన శంకుస్థాపన చేశారు. ఆయనతో పాట బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, బొబ్బిలి జనసేన ఇన్‌చార్జి గిరిడ అప్పలస్వామి ఉన్నారు. పోలమ్మవారి గుడికి వెళ్లేందుకు సుమారు రూ.20 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గొల్లాది ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, పామోటి గోవిందరావు, గిరిడ గోవిందరావు, గిరడ అప్పలనాయుడు, పుండ్రి, గోపీ పాల్గొన్నారు.

సందడిగా మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యరెడ్డి

బాడంగి, జూలై10 (ఆంధ్రజ్యోతి): గజరాయనివలస పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో బోధనా విధానాల కోసం అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు లోకేశ్ సంకల్పించారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవి, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ, పెదపల్లి సర్పంచ్ ఆవు సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పాలవలస గౌరు తదితరులు పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్, జూలై10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం సందడిగా నిర్వహించారు. మండలంలోని పిరిడిలో హెచ్‌ఎం డి.మధుసూధనరావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పరిచయాలు బాగుంటే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందన్నారు. అలాగే ప్రతి విద్యార్థిలోనూ నాయకత్వ లక్షణాలు ఉండాలన్నారు. నాయకత్వం అంటే కేవలం పదవి కాదని, అది ఒక బాధ్యత అని తెలిపారు. ఇక్కడ ప్రతీది నేర్చుకోవాలి, తెలుసుకోవాలి, ఆచరించాలి, బాధ్యతగా మెలగాలని అన్నారు. గెలుపు, ఓటమి, సుఖం, దుఃఖం ఇలా మనకు ఏదో ఒకటి నేర్పుతూ ఉంటాయని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ్ మాట్లాడారు. అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి



రావివలసలో ఎమెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి, జూలై10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం రావివలసలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది పాలనతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పరిపాలన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, అంబటి రాంబాబు, మాజీ ఎంపీపీ కోట గౌరమ్మ పాల్గొన్నారు.

సందడే సందడి

(ఐదో పేజీ తరువాయి)

చర్యల గురించి వివరించారు. తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరుకావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తల్లిదండ్రులు, విద్యార్థులు ఒకే చోట ఉన్నారు. సామూహిక భోజనాలు చేశారు.

సామాజిక బాధ్యతగా..

విద్యార్థులకు సామాజిక బాధ్యతను గుర్తుచేస్తూ మొక్కలను అందించారు. వారితో మొక్కలు నాటించారు. నాటిన మొక్కల సంరక్షణకు మూడేళ్ల పాటు తామే బాధ్యత తీసుకుంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. వారికి గ్రీన్ పాస్‌పోర్టు కూడా అందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లి పేరుతో మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. విస్తృతంగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. విద్యాశాఖ తనవంతు బాధ్యతగా ఈ రోజు కోటి మొక్కలు నాటాలని నిర్ణయించింది. పర్యవేక్షించేందుకు కలెక్టర్ అంబేడ్కర్ నేతృత్వంలో కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు సమగ్ర వివరాలతో పత్రాలు

గతానికి పూర్తిగా భిన్నంగా మెగా తల్లిదండ్రుల సమావేశాలు జరిగాయి. తల్లిదండ్రులకు విద్యార్థులే స్వయంగా స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా పాఠశాలల ప్రాంగణంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయడం విశేషం. పిల్లల చదువు, ఆరోగ్యం, విద్యాలయాల్లో వసతులు, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి తల్లిదండ్రులతో చర్చించారు. ప్రతి పాఠశాలలో పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలియజేసే కార్డులు అందించారు. వారి మానసిక, ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా అందించిన సమగ్ర పత్రాలు బాగున్నాయి. ఆకట్టుకునేలా ఉన్నాయి. బాలల ఆరోగ్య వివరాలు, గత ఏడాది సాధించిన ఫలితాలు, తల్లికి వందనం పథకంలో బాలల వివరాలు, విద్యార్థి సమగ్ర నివేదిక వంటివి అందులో పొందుపరిచారు. మరోవైపు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సైతం అలరించాయి.

తల్లిదండ్రుల్లో హర్షం..

పేరెంట్స్, టీచర్స్ మెగా సమావేశంపై తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమౌతున్నది. కార్పొరేట్ స్కూల్స్‌లో పేరెంట్స్ సమావేశాలు తరచూ జరుగుతుంటాయి కాని ఈ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు, స్కూల్స్‌లో నిర్వహించడం అందరినీ ఆకట్టుకుంది. తల్లిదండ్రులు, పిల్లలు ఈ సమావేశంలో కూర్చోవడం, స్కూలో వున్న సమస్యలు ప్రస్తావించడం, ఆ సమస్యల పరిష్కారానికి ఏ విధంగా కృషి చేయాలన్నది సమావేశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిర్ణయాలు తీసుకోవడం విశేషం.

చక్కని విద్య లభిస్తోంది..

-కాకర కొండబాబు, తోటపల్లి గ్రామం, జామి మండలం

నా కుమార్తెకు చక్కని విద్య ఉచితంగా లభిస్తోంది. మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ద్వారా కుమార్తె చదువు గురించి ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సమావేశంతో ఉపాధ్యాయులతో పాటు ఇతర తల్లిదండ్రులతో పరిచయాలు ఏర్పడ్డాయి. స్కూల్‌లోని సమస్యలు కూడా తెలిశాయి. పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమష్టిగా నిర్ణయాలు తీసుకున్నారు.

ప్రోత్సాహంతో 523 మార్కులు సాధించా..

-మౌనిక, ఇంటర్ ప్రథమ సంవత్సరం

టెన్త్‌లో ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో 563 మార్కులు సాధించాను. పాఠశాలలో చదువుతో పాటు క్రమశిక్షణ, ఆటలు, వివిధ అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించడం వల్ల అనేక పతకాలు సాధించాను. ఏడాదికి ఒక్కసారి కాకుండా విద్యా సంవత్సరంలో రెండు పర్యాయాలు ఈ విధమైన సమావేశాలు నిర్వహిస్తే ఇంకా మేలు జరుగుతుంది.

సర్వేల సమీక్ష



మాట్లాడుతున్న డీడీవో కిరణ్‌కుమార్

బొబ్బిలి రూరల్, జూలై10 (ఆంధ్రజ్యోతి): వివిధ సర్వేలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డీడీవో ఎం.కిరణ్‌కుమార్ పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేల నివేదికలను నిర్ణీత సమయంలో ఎంపీడీవోకు అందించాలన్నారు. ముఖ్యంగా పి-సర్వేల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సర్వేలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు పాల్గొన్నారు.

● మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గల రక్షిత మంచినీటి వాటర్ ట్యాంకు పరిసరాలను పరిశీలించారు. వాటర్ ట్యాంకును ఎప్పుడు శుభ్రం చేశారని వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో రవికుమార్ ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

బొబ్బిలి రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురంలో పారిశుధ్య పనులను గురువారం ఎంపీడీ వో రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి సంపద కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు. కాలువలు, రోడ్లపై చెత్త వేయకుండా గ్రీన్ అంబాసిడర్లకు చెత్తను అందించాలని ప్రజలకు సూచించారు. అనంతరం వాటర్ ట్యాంకును క్లోరినేషన్ పనులను పరిశీలించారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు ఉన్నారు.

చీపురుపల్లి పోలీసులకు అభినందనలు



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న చీపురుపల్లి సీఐ

చీపురుపల్లి, జులై 10 (ఆంధ్రజ్యోతి): చోరీ ఘటనలో నిందితుల్ని పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేసిన ఘటనలో ప్రతిభ కనబరిచినందుకు చీపురుపల్లి పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. ఈ మేరకు గురువారం తన కార్యాల యంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. మే నెల చివరి వారంలో పట్టణంలోని ఆర్వోబీ వద్ద జరిగిన చోరీ ఘటనలో, చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు రెండు రోజుల్లో పది మందిని అదుపులోకి తీసుకుని, తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఈ ఘటనలో పోయిన సొత్తును కూడా రికవరీ చేశారు. ఈ దర్యాప్తులో పాలుపంచుకున్న సీఐ జి.శంకరరావు, ఎస్ఐ ఎల్.దామోదరరావు, సిబ్బంది భనోజీరావు, రమణ, రాంబాబులను అభినందిస్తూ ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరిని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘువులు అభినందించారు.

డెంకాడ ఎస్ఐకి రెండు ప్రశంసాపత్రాలు

●డెంకాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఐ ఆరంగి సన్యాసి నాయుడు ఎస్పీ వకుల్ జిందాల్ చేతులమీదుగా రెండు ప్రశంసా పత్రా లు అందుకున్నారు. జిల్లాలో లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కా రంలో ఉత్తమ ప్రదర్శన చేసినందుకు క్రైం మీటింగ్‌లో అవార్డు తీసుకు న్నారు. అదే విధంగా నేరాలు డిటెక్షన్‌లో భాగంగా మండలంలో అత్యధి క సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినందుకు మరో ప్రశంసాపత్రం అందు కున్నారు. ఎస్ఐకి పోలీసు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కొమిరిలో క్విజ్ పోటీలు

రేగిడి, జూలై 10,(ఆంధ్రజ్యోతి): కొమిరి గ్రామంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా గ్రామస్థులు మండల స్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 11 హై స్కూళ్లు పాల్గొనగా.. లక్ష్మీపురం పాఠశాల ప్రథమ (రూ.3వేలు), దేవుదల పాఠ శాల ద్వితీయ (రూ.2500), ఖండ్యాం పాఠశాల తృతీయ బహుమతులు పొందాయిని నిర్వాహకులు తెలిపారుజ.

బల్లంకిలో ఉచిత పశువైద్య శిబిరం

వేపాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బల్లంకి గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 85 పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించినట్టు మండల పశు వైద్యాధికారి కె.గాయత్రీ తెలిపారు. పశు సంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

వేపాడ, జూలై 10 (అంధ్రజ్యోతి): రైతులు వరి సాగుకు ముందుగా నవధాన్యాల సాగు చేపట్టడం వల్ల భూసారం పెరుగుతుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు అన్నారు. కొండగంగుబూడి యూనిట్ పరిధిలో చేపడుతున్న నవధాన్యాల సాగును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డీపీఎం నవధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు, ఇన్‌చార్జి పెంటయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

పార్వతీపురం టౌన్, జూలై10 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రంలోని పలు షిర్డీ సాయి మందిరాల్లో గురువారం గురు పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బైపాస్ రహదారి, సౌందర్య నారాయణమూర్తినగర్, సాయినగర్ కాలనీ, బూరాడ వీధి, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బైపాస్ రహదారిలోని బాబా మందిరానికి రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరావు దంపతులు విచ్చేశారు. బాబాకు క్షీరాభిషేకం చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుడా ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

రుషి యోగా కేంద్రంలో..

పాలకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని రుషి యోగా కేంద్రంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. యోగా గురూజీ ధనుంజయ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. యోగా కేంద్ర నిర్వాహకులు బొడ్డు రామ్మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించన కార్యక్రమంలో యోగా గురువు మాట్లాడుతూ సమాజంలో గురువు ప్రాధాన్యతని వివరించారు. ఈ సందర్భంగా పలువురు గురువులను సత్కరించారు. కార్యక్రమంలో యోగా సాధకులు డొకర శ్రీనివాసరావు, లక్ష్మీపతి, శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణరావు, సునీత పాల్గొన్నారు.

చిగురు తుంచి నాట్లు వేయండి

బొబ్బిలి రూరల్, జూలై10 (ఆంధ్రజ్యోతి): వరి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని బొబ్బిలి ఏడీఏ శ్యామ్‌సుందర్ అన్నారు. మండలంలోని నారాయణప్పవలసలో గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో నారు తీస్తున్న రైతుల వద్దకు వెళ్లి పలు సూచనలు చేశారు. వరి నాట్లు వేసే ముందు నారు చిగుళ్ల తుంచాలని, ఇలా చేస్తే తెగుళ్ల వ్యాప్తి చేందకుండా నివారించవచ్చునని సూచించారు. పురుగు మందుల వాడకం తగ్గించుకోవాలన్నారు.

సాగునీరు విడుదల



పూజలు చేస్తున్న అధికారులు

కొమరాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జంఝావతి నీటిని ఖరీఫ్ పంటకు గురువారం జలవనరుల శాఖ అధికారులు విడుదల చేశారు. 9 వేల ఎకరాలకు సాగునీటిని అందించనున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు నీటిని విడుదల చేయడం జరిగిందని బొబ్బిలి సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు ఎం.భాస్కరరావు, ఎ.డిల్లీశ్వరరావు, బి.రవీంద్ర, కె.అప్పలనాయుడు, బి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

కొమరాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి కూనేరు అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా మారడంతో ప్రభుత్వం స్పందించి తక్షణ మరమ్మతులు చేయించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. గురువారం రహదారి మరమ్మతు పనులను రహదారులు భవనాలు శాఖ ప్రారంభించింది. దీనితో ఈనెల 11న సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న రాస్తారోకో విరమించుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ జేఈ రాజేంద్ర, డీఈ అప్పాజీ పేర్కొన్నారు.

టీడీపీ మండల కన్వీనర్‌గా కొండయ్య

కురుపాం, జూలై10 (ఆంధ్రజ్యోతి): కురుపాం మండల టీడీపీ కన్వీనర్‌గా కె.వి.కొండయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, టీడీపీ నాయకులు చర్చించి అతడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బెజ్జుపురంపు శంకరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలుగా సుకుష్ చంద్ర పండా, రంజిత్ కుమార్ నాయకోలను నియమించారు. ఈ సందర్భంగా కురుపాం కోటలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్ కండువా కొండయ్యకు వేసి సన్మానించారు. కార్యక్రమంలో తెలుగుయువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.